# "అభాగినిమూలంగా నిరాడంబర జీవితం"



ఆరోజు ఆలశ్యంగా మెళుకువ వచ్చింది. ముఖమల్ దిండ్ల నానుకొనివున్న తలనెత్తి నాల్గువైపులా చూశా. మూర్తి లేచి అప్పుడే ఎక్కడకో వెళ్లిపోయాడు. టేబిల్ మీద కాఫీ ఫలహారాలు నాకై నిరీక్షిస్తున్నాయి. "ఎంతసేపలా సోమరిలా నిద్రపోతావ్? ఎంతోసేపయిందివచ్చి, చప్పగా చల్లారిపోతున్నా" అన్నట్లు కాఫీ కప్పులోంచి ఆవిరి రింగు రింగులుగా తిరుగుతూ సందేశంతెచ్చింది. లేచి కిటికీలోంచి వీధిలోకిచూస్తే ఒక అభాగిని, కుంచుకుపోయిన డొక్కలతో, శుష్కించిన సౌందర్యంతో "అమ్మా! గుప్పెడు మెతుకులు పెట్టండి" అని హీనస్వరంతో పిలుస్తూ మా యింటి దగ్గరే నిలబడింది. ఆ దృశ్యంచూసి ఉలిక్కిపడ్డా.—అబ్బా! ఆమెకు నాకూ ఎంత తేడావుందీ? ఆకలి కడుపులను సంతృప్తిపరచ లేక అల్లాడే అభాగ్యులెంతో మందివుంటే వారిని చూడటానికి కళ్లే లేనట్లు, వారిఆర్తనాదాలు వినడానికి చెవులే లేనట్లు, హృదయమే లేనట్లు, మానవత్వమే నశించిపోయినట్లు, రాక్షసత్వము తప్పనట్లు, ముఖమల్ దిండ్ల నానుకొని మైమరచి నిద్రపోతున్నానా? ఎంత అన్యాయం? ఎంత అక్రమం? ఎంత ద్రోహంచేస్తున్నానో వాళ్లకి! వినోదాలకి, విలాసాలకి, అనవసరంగా కర్చుచేసే ధనంతో వారి ఆకలి పేగుల్ని చల్లార్చ లేనూ? నాకు వచ్చిన విద్య చెప్పి వృద్ధిలోకి తీసుకురాలేనూ? కొన్ని ప్రాణులకైనా జీవనోపాధి కల్పించలేనూ? ఎందుకు లేనూ? నిక్షేపంలావున్నాను.—ఈ భావపరంపరలలో హృదయం వేగిపోయింది. క్రిందకువచ్చి ఆమె ఎదురుగా నిశ్చేష్టురాలనై నిలబడిపోయా. నన్నుచూసి సిగ్గుపడుతూ నేనేదో గొప్పదానిగా, తన నేదో నీచురాలుగా భావిస్తున్నట్లు ఆమె ముఖం, కళ్లు అభిమానంతో నిండిపోయాయి. "అమ్మా! నిన్నటినుంచి తిండిలేదు. గుప్పెడు చద్ది మెతుకులైనా పెట్టు తల్లీ!" అంది. దుఃఖావేశంతో వెళ్లి ఆమెను ఆలింగనం చేసుకున్నాను. ఆమె తెల్లబోయింది. పరవాలేదని పైకి తీసుకువచ్చి సోఫాలో కూర్చోబెట్టి ఆమె ప్రక్కన కూర్చున్నా. "భయపడకు. నిన్ను నా సోదరిలా చూసుకుంటా. ఇవి తిను" అని అక్కడే వున్న ఫలహారాలు ఆమెకు అందించా. "వద్దు తల్లీ! చద్ది అన్నం చాలు" అంది. "అబ్బా! ఎంత అల్ప సంతోషి! మన ఆశలకీ వారి ఆశలకీ ఎంత తేడావుందో! అభాగ్యుల హృదయంలోనే అమృతం వుంటుందేమో! అన్నం, బట్టా లోటు లేకుండా గడిచిపోతుంటే చాలదూ! గాదికొట్లు నిండా ధాన్యం వుండాలి. బీరువాల నిండా నగలూ, బట్టలూ వుండాలి. అంతటితో ఆగిందా, విలాసాలకి పుష్కలంగా ధనం వుండాలి. అధమం, తిరగటానికి నాలుగు కారులైనా వుండాలి. కారులు వుంటే విమానాలు వుండాలి. అవి వుంటే ఓడలు వుండాలి. ఓడలు వుంటే రాజ్యాలు కావాలి. రాజ్యాలు వుంటే సామ్రాజ్యాధిపత్యమే కావాలి. ఆకలితో నకనకలాడే అభాగ్యులెంతోమంది ఏడుస్తుంటే నాలాంటి వారి ఆశలు ఇలా అంతు లేకుండావుంటాయి. పాపం చద్ది అన్నం చాలుట!" ఇలాటి వూహాలతో మనస్సు బరువెక్కిపోయింది. అఖరికి బ్రతిమాలితే తిన్నది. తరువాత

# " అభాగినిమూలంగా నిరాడంబర జీవితం "

ఇలా చెప్పింది.—నా కెవ్వరూ దిక్కులేరు; ముష్టి ఎత్తుకునే చావ లేక బ్రతుకుతున్నా. ఏదైనా పని చేద్దామంటే "చచ్చేదానిలావున్నావు నీకేంపని"అని నన్ను చూసే అసహ్యించుకుంటారు. దొంగ అంటారు; కులట అంటారు. అభాగ్య జీవిని. ఏం చెప్ప మంటావు తల్లీ! నాకు ప్రపంచంలో వుండడానికి చోటులేదు." అని ముగించింది. నా మనస్సు దుఃఖంతో నిండిపోయింది. ఆమె నాకేదో ఉపదేశం చెయ్యడానికి వచ్చిన దేవతామూర్తిలా కనుపించింది. ఆ క్షణంలోనే నా మనస్సు మారి పోయింది. నా కళ్లు పూర్తిగా మత్తు వదిలాయి. ఆ రోజు మొదలు ఆమె మా యింట్లోనే వుండిపోయింది. వంట, ఇంటి పన్లు, ఆమెతోగూడ నేను చేసుకునే దానిని ఎన్నో ఖర్చులు తగ్గించేశాను. అనవసరంగా ఖర్చుచేసే డబ్బంతా కూడబెట్టి దానిని పీడిత ప్రజలకై వినియోగించాలని, ఆమెను చూసిన రోజే నిశ్చయించుకున్నాను. నా ఖర్చులన్నీ తగ్గాయి.

ఇక మూర్తి ఖర్చుల మీదికి దాడి బయలు దేరింది నా మనస్సు. ఆయన స్నేహితులంతా భాగ్యవంతులే. తిండికీ గుడ్డకు ఇబ్బంది పడేవాళ్లుకారు. వాళ్లకోసం రోజూ సినిమాలు, కాఫీలు, పళ్లు, ఫలహారాలు వీటికై విపరీతంగా ఖర్చు చేసేవారు. అది సహించలేక ఆయనతో అనేకసార్లు చెప్పాను. ఎంతసేపూ నిండిన కడుపులనే నింపడం, సుఖంగా వున్నవాళ్లనే సుఖపెట్ట చూడటం, తిండికి కూడా లేని నిరుపేదల్ని చూసి ఏవగించుకోవడం, శోచనీయమని రోజూ వాదించే దాన్ని. ఒకొక్కసారి మూర్తి చిరాకు పడుతూవుండేవాడు. పోనీ కదా అనినా మనస్సును మరల్చలేక పోయేదాన్ని. ఒక రోజు సాయంకాలం తన మిత్రులతో సహా వస్తాననీ పళ్లు, పాలు, పలహారాలు కాఫీ, టీ ఇంకా ఎన్నో ఏర్పాట్లు చెయ్యమని చెప్పి వెళ్లాడు. నేను మాత్రం కాఫీ ఒకటే తయారుచేశాను. ఇరవై మంది స్నేహితులతో వచ్చాడు. వాళ్లని హాల్లో కూర్చో బెట్టి, "అన్నీ సిద్ధమా" అన్నాడు. "అన్నీ ఎందుకూ? స్నేహాన్ని వెల్లడి చేసుకోడానికి ఇన్ని రకాలు కావాలని వుందా? ఇంతా చేస్తే వారివి కడుపు నిండిన బేరాలు. అన్నింటి మీదా అతి పోగ్గా మృదువుగా వ్రేళ్లువేసి ఎంగిలి చెయ్యడమే. అవన్నీ మట్టిపాలు. కడుపు నిండుగావున్న వాళ్లని తిను తిను అని బ్రతిమాలడమెందుకూ? అందుకే కాఫీ ఒక్కటే సిద్ధం చేశా" అన్నాను. అంతే. ఎప్పుడూ అంత కోపం రాలేదు. చేతితో ఒక లెంపకాయ, కాలితో డొక్కలో ఒక్క తాపుతన్ని ఏమై పోయానో తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు. కళ్లు గిర్రుమని తిరిగి అబ్బా! అంటూ నేలకి ఒరిగిపోయాను. పురుషులు నిరంకుశులుకదా! నాకెంతో ఆశ్చర్యం వేసింది. విద్యావివేకాలు కలిగి, భార్యను గాఢంగా ప్రేమించి గౌరవించే భర్తలుకూడా మధ్యమధ్య అధికారంతో ఇట్లా చేస్తుంటే సామాన్యుల సంగతి వేరే చెప్పాలా? ఇంతలో తన స్నేహితులతో ఏవో అబద్ధాలు చెబుతున్నాడు. నాకింక ఆవేశం ఆగలేదు. బాధను లక్ష్యపెట్టకుండాలేచి వాళ్ల దగ్గరకు వెళ్లి "సోదరులారా వినండి. యదార్థం చెబుతున్నా. ఆయనకి మీరు మిత్రులు; నాకు సోదరులు. మీయందుండే స్నేహమును వెల్లడి చేసుకోడానికి ధనమే ప్రధానమా? విందులూ, వినోదాలేముఖ్యమా? మనవంటి మానవులే, మనవలె ఆకలి దప్పులు కలవాళ్లే, మండే కడుపుతో ఎంతో మంది ఆక్రోశిస్తుంటే చూసి కొంచెమేని కనికరించలేక, తిన్నవాళ్ళకే పెడుతూ నిండిన కడుపులనే నింపుకోవడం మానవత్వం కాదని, నిరాడంబర జీవితాన్ని అలవరచుకొని అనవసరపు ఖర్చులు తగ్గించుకొని తోటి సోదరులకు జీవనోపాధి కల్పించాలని, ఇంకా ఏమేమో ఆశయాలతో నా ఖర్చులన్నీ తగ్గించి ఆయన ఖర్చులు కూడా తగ్గించమని చాలా సార్లు చెప్పాను. మీకై ఫలహారాలు మాని వట్టి కాఫీయే సిద్ధం చేశానని కోపంతో నాయందుండే ప్రేమను చంపుకొని,నాల్గు మాసాల గర్భిణినని అయినా తలచక డొక్కలో తన్నారు. ఇది ఎంతవరకు"—మాట పూర్తి కాకుండానే పెద్ద నొప్పివచ్చి నేలకి ఒరిగి పోతుంటే పడిపోయి దెబ్బతగలకుండా ఎవరో ఆపుచేశారు. ఆ మరుక్షణంలోనే తెలివి తప్పిపోయింది.

నాకు బాగా తెలివి వచ్చి కళ్లు విప్పి చూస్తే నేనొక ఆస్పత్రిలోవున్నాను. నా ప్రక్కన మూర్తి దుఃఖభారంతో కూర్చునివున్నాడు. నేను కళ్లు విప్పడం చూసి నా చెయ్యి

దగ్గరకి తీసుకుంటూ "రాధా! నీకు తీరని అపచారం చేశాను" అన్నాడు జాలిగా చూస్తూ. ఆతృతగా "ఏం జరిగింది" అన్నాను. "నిన్న నీవలా పడిపోయాక నా మిత్రులంతా నన్ను చాలా మందలించి, నిన్నిక్కడ జేర్పించారు. సరియైన తెలివికూడా లేక నిన్న ప్రమాదస్తితిలోనే వున్నావు. ఇంక పరవాలేదని ఈ రోజు డాక్టరు చెప్పింది. నిన్ను చిట్టిసోదరిగా తలుస్తూ నీ ఆశయాన్ని తు, చ తప్పకుండా అమలు జరిపి తాముకూడా నిరాడంబర జీవితాన్ని గడపడానికి నిశ్చయించుకున్నారు. ఇక వారు నీ వంటిమీద ఈగ వాలనియ్యరు. అవివేకంతో నీ శరీరం మీద సర్వాధికారాలు నావే అయినట్లు పశువులా ప్రవర్తించాను. నాకేదైనా శిక్ష విధిస్తేనేకాని నాకు శాంతి వుండదు." అన్నాడు. నేనొక దీర్ఘ నిశ్వాసం విడిచి, "గతించిన దానికి విచారించరాదు మూర్తీ! మీమిత్రుల నిశ్చయానికి చాలా సంతోషిస్తున్నా. ఆ అభాగిని మూలంగా నాకు, నా మూలంగా మీమిత్రులకు పరివర్తనం కలిగినందుకు సంతసించాలి" అన్నాను. మా హృదయాలు ఆమె దర్శన వేళా విశేషం చేత కాంతి వంతములయాయి. "అభాగిని మూలంగా నిరాడంబర జీవితం" అంటూ మూర్తి చేతిని హృదయానికి హత్తుకొన్నాను. "మీరుకూడా అభాగ్యుల కోసం నిరాడంబర జీవితాన్ని అలవరచుకుంటారు కదూ! పీడిత ప్రజల్ని కనికరిస్తారు కదూ!!

—ఎ. వి. రమణ

★

## మన సామెతలు

1. కొద్ది కొద్దిగా తీస్తే, కొండ కూడ సమసిపోతుంది.

2. కొండత్రవ్వి యెలుకను పట్టినట్లు.

3. కోడిగుడ్డు పగులగొట్టుటకు గుండ్రాయి కావలెనా ?

4. తాడిచెట్టు యెక్కేవాడిని యెందాక తొయ్యగలము.

5. చెడి చెన్నపట్నంచేరు.

6. చెప్పితే సిగ్గు, దాస్తే దుఃఖం.

7. చెరువు నిండితే కప్పలు చేరుతవి.

8. చేసేది బీద కాపురము, వచ్చేవి రాజ రోగాలు.

9. తప్పు చేయనివారు ధరణిలో లేరు.

10. తల్లిదైవము, తండ్రిధనము.

11. తీగెకుకాయ బరువా ?

12. తుమ్మితే వూడిపోయేముక్కు యెన్నాళ్లు వుండును ?

13. తానేతుమ్మి తానే చిరంజీవి అనుకొన్నట్లు.

14. తొమ్మిదేండ్లకు మెడలునిలిపి, తోడనే పదేండ్లకు దోగాడి, యవ్వల నలువది యేండ్లకు అమ్మా యనెనట.

15. దొంగకు దొంగబుద్ధి, దొరకు దొర బుద్ధి.

16. భోజునివంటి రాజు కలిగితే, కాళిదాసు వంటి కవి అప్పుడే వుంటాడు.

17. వచ్చీ రాని మాటల రుచి, వూరీ వూరని వూరుగాయ రుచి.

18. మున్నూరు శిగలయినా కూడ వచ్చును గాని, మూడు కొప్పులు కూడ రాదు.

కూర్పు: శ్రీమతి మన్యం కామేశ్వరీదేవి

★